
2 లో..

# కూల్ కూల్

అకాల వర్షంతో చల్లబడిన వాతావరణం

ఉపిరి పీల్చుకున్న జనం


# వరంగల్ వాయిస్

www.warangalvoice.net

Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 272 | మంగళవారం | 07 మే 2024 | పేజీలు : 08 | వెల రూ. 5


# అందరూ జాదూగాళ్లే..!



- లాభసాటి వ్యాపారంగా రాజకీయం
- కష్టం రెండు నెలలు.. అధికారం ఐదేళ్లు
- బురద జల్లడం, బురిడీ కొట్టించడమే లక్ష్యం
- తిట్టుకోవడంలో ఒకరిని మించి మరొకరు
- సర్వసాధారణంగా మారిన ఫేక్ వీడియోలు, అబద్ధపు ప్రచారాలు






వివరాలు 2లో..

సిద్ధాంతాలు పక్కకు పోయాయి.. సమస్యల ప్రస్తావన లేదు.. ఎదుటివారిని బురిడీ కొట్టించడం.. బురదజల్లడం, ఓట్లను దండుకోవడం వంటి విద్యల్లో రాజకీయ నేతలు ఆరితేరారు. రాజకీయం లాభసాటి వ్యాపారంగా మారడంతో అబద్ధాలు ప్రచారం చేయడం.. ఫేక్ వీడియోలు విడుదల చేయడం ఎన్నికల్లో సర్వసాధారణంగా మారింది. ఓ రెండు నెలలు కష్టపడితే ఐదేళ్లు అధికారం వెలగబెట్టవచ్చు. ప్రజలను నిత్యం మోసం చేస్తూ ఉండవచ్చు. అందినకాడికి దండుకోవచ్చు. ఇందుకు ఎవరూ అతీతులు కారు. అంతా ఒకే తాను ముక్కలు. ఐతే ఈసారి చూస్తున్నంతగా అబద్ధాలు, పరస్పర దూషణలు గతంలో ఎన్నడూ లేవు. తిట్టుకోవడంలో ఒకరిని మించి ఒకరు పోటీ పడుతున్నారు. సభ్య సమాజం ఒకటి ఉందన్న విషయం మరిచిపోయారు. సోషల్ మీడియా ముఖ్యంగా టీవీలు, యూట్యూబుల్లో ఈ పైత్యం పెరిగింది. రాజకీయ పార్టీల మధ్య పోటీ అన్నది పోయి.. వ్యక్తుల మధ్య దూషణల పర్వంలా ఎన్నికల ప్రచారం సాగుతోంది. మేనిఫెస్టోలను ప్రకటించినపుడు కలిపి నోట్లో ముద్ద పెట్టడమే తరువాయి అన్నచందంగా హామీల జాబితా తయారవుతోంది. తర్వాత అంతా డొల్ల వాగ్దానాలుగా మిగిలిపోతున్నాయి. - వరంగల్ వాయిస్, వరంగల్


8లో

## కేంద్రంలో గెలిచేది మోడీ.. ఇక్కడ గెలిచేది అరూరి

- కడియం శ్రీహరి ఒక మేక వన్నె పులి
- ఆయన చరిత్ర అందరికీ తెలుసు
- మీట్ ది ప్రెస్‌లో బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్



8లో

## అట్టహాసంగా రాకేష్ రెడ్డి నామినేషన్

భారీ బైక్ ర్యాలీ | గులాబీమయమైన నల్గొండ పట్టణం


8లో

## బలరాం నాయక్‌ని గెలిపించండి

అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తాం

రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి డాక్టర్ సీతక్క

# అందరూ జాదూగాళ్లే..!



**లాభసాటి వ్యాపారంగా రాజకీయం**

**కష్టం రెండు నెలలు..అధికారం ఐదేళ్లు**

**బురద జల్లడం, బురిడీ కొట్టించడమే లక్ష్యం**

**తిట్టుకోవడంలో ఒకరిని మించి మరొకరు**

**సర్వసాధారణంగా మారిన ఫేక్ వీడియోలు, అబద్దపు ప్రచారాలు**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాజకీయం లాభసాటి వ్యాపారంగా మారింది. ఓ రెండు నెలలు కష్టపడితే ఐదేళ్లు అధికారం వెలగబెట్టవచ్చు. ప్రజలను నిత్యం మోసం చేస్తూ ఉండవచ్చు. అందినకాడికి దండుకోవచ్చు. అనతి కాలంలోనే కోట్లకు పడగెత్తవచ్చు. ఇందుకు ఎవరూ అతీతులు కారు. అంతా ఒకే తాను ముక్కలు. ఇందులో ఒకరిపై ఒకరు పోటీ పడుతున్న తీరు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాలు చేస్తోంది. సిద్ధాంతాలు పక్కకు పోయాయి. సమస్యల ప్రస్తావన లేదు. ఎదుటివారిని బురిడీ కొట్టించడం..బురదజల్లడం, ఓట్లను దండుకోవడం వంటి విద్యల్లో రాజకీయ నేతలు ఆరితేరారు. అబద్దాలు ప్రచారం చేయడం..ఫేక్ వీడియోలు విడుదల చేయడం ఎన్నికల్లో సర్వసాధారణంగా మారింది. దేశంలో కీలకమైన సమస్యలను పరిష్కరించే సత్తా నేతల్లో కానరావడం లేదు. సాగు, తాగునీటి సమస్యలను పరిష్కరించే ఉపాయాలు నేతల్లో లేవు. వ్యవసాయాన్ని ఎలా ముందుకు తీసుకుని వెళ్లవచ్చో..అన్న లోచనలు అస్సలు లేవు.

## అరచేతిలో వైకుంఠం..

ప్రజలు పేదలుగానే ఉండిపోవాలి, అడుక్కుతినే స్థితి నుంచి దాటి రావద్దు అన్నది రాజకీయ నాయకుల లక్ష్యంగా మారింది. ఉచిత బియ్యం, పెన్షన్లు, ఇళ్ల పందేరం, డబ్బుల పందేరం వంటివి చూపి ఓట్లు కొల్లగొట్టడం అలవాటు చేసుకున్నారు. పన్నులు పెంచడం, పందేరం చేయడంలో నేతలు పోటీ పడుతున్నారు. దీనికోసం మనమంతా ఓట్లు వేస్తున్నామని గుర్తించడం లేదు. ఎన్నికల్లో ప్రజలను నమ్మించేందుకు అన్ని పార్టీలు కూడా మితివిరీరిన వాగ్దానాలు చేయటం అలవాటుగా చేసుకున్నాయి. అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారు. మేనిఫెస్టోలను ప్రకటించినపుడు అలవిగాని హామీలు అన్నీ ఇందులో చోటు చేసుకుంటున్నాయి. కలిపి నోట్లో ముద్ద పెట్టడమే తరువాయి అన్నచందంగా హామీల జాబితా తయారవుతోంది.

## హద్దులు దాటిన ఆరోపణలు..

రాజకీయ నాయకులు ఒకరిపై ఒకరు పరస్పర ఆరోపణలు చేసుకోవటం హద్దులు దాటింది. కొత్తగా వీడియోలు మార్ఫింగ్ చేయడం..చెప్పని డైలాగులు చొప్పించడం వంటివి కూడా చేస్తూ ఎదుటి వారిని ప్రజల్లో బద్నాం చేయడంలో నిష్ణాతులు అవుతున్నారు. ఈసారి చూస్తున్నంతగా అబద్దాలు, పరస్పర దూషణలు గతంలో ఎన్నడూ లేవు. తిట్టుకోవడంలో ఒకరిని మించి ఒకరు పోటీ పడుతున్నారు. సభ్య సమాజం ఒకటి ఉందన్న విషయం మరిచిపోయారు. సోషల్ విరీడియా ముఖ్యంగా టీవీలు, యూట్యూబుల్లో ఈ పైత్యం పెరిగింది. రాజకీయ పార్టీల మధ్య పోటీ అన్నది పోయి..వ్యక్తుల మధ్య దూషణల పోటీలాగా ఎన్నికల ప్రచారం సాగుతోంది. ఇక విషయం ఏదైనా ప్రజల వద్దకు వెళ్లి విషప్రచారాలు చేసుకోవడంలో నైపుణ్యాలు ప్రదర్శిస్తున్నారు. అబద్దాలు, ఆరోపణలు, చివరకు ఎన్నడూ లేని విధంగా వ్యక్తిగత దూషణలు పెరుగుతున్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థ ఎంతగా పతనం అయ్యిందో తాజా ఎన్నికల ప్రచారం చూస్తే తెలుస్తుంది.

## పాలనపై కోల్పోతున్న విశ్వాసం..

రాజకీయ నాయకులు తమ పాలన కాలంలో చేసిన మంచి పనులపై ప్రజలకు విశ్వాసం కల్పించలేక పోతున్నారు. అందుకు కారణం.. సమస్యలను పరిష్కరించే సత్తా ప్రదర్శించలేక పోవడమే. అయినప్పటికీ అధికారం కోసం నానా గడ్డీ కరుస్తున్నారు. ప్రజలను మరోమారు వంచించాలంటే అబద్దాలే అవసరం అని గుర్తిస్తున్నారు. అబద్దాలతో, ప్రత్యర్థులపైన ఆరోపణలతో ఏదో ఒక విధంగా మెప్పించే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. తమ వైఫల్యాలను, బలహీనతలను ప్రజల దృష్టిలో మరుగునపడేట్లు చేయడం కోసం ఎదుటి పక్షంపై ఎంతకైనా తెగిస్తున్నారు. బురదజల్లుతున్నారు. ఇలా ప్రజల దృష్టిని పక్క దారి పట్టించేందుకు అవసరమైన టక్కుటమార, గజకర్ణ, గోకర్ణ విద్యలన్నీ ప్రదర్శిస్తున్నారు. అబద్దాలు, ఆరోపణలు, దూషణలతో హంగామా సృష్టించడంలో రాటుదేలారు. ఇలాంటి ప్రచారాలతో వ్యక్తుల స్థాయి, సంస్కృతి, సంస్కారం, నాగరికత, ప్రజాస్వామిక విలువలు పతనమవుతున్నా పట్టించుకోవడం లేదు.

## భారంగా బతుకులు..

అధికారం ద్వారా సంపదను పోగుచేసుకోవడం లక్ష్యంగా రాజకీయం సాగుతోంది. అందుకు నానాగడ్డీ కరుస్తున్నారు. మనకు స్వాతంత్రం లభించినప్పటి నుంచి పాలించిన పార్టీలు, తర్వాత ఉనికిలోకి వచ్చిన ప్రాంతీయ పార్టీలు, కుల పార్టీలు, వేర్వేరు సిద్ధాంతాల పార్టీలుగాని క్రమంగా తమ పరిపాలనలో విఫలమవుతూ వచ్చాయి. సిద్ధాంతాలకు దూరమవుతూ వచ్చాయి. ఆర్థిక సంస్కరణలు వ్యక్తులు, నాయకులు, పార్టీలు సంస్థల ప్రాపంచిక దృక్పథాన్ని గణనీయంగా ప్రభావితం చేయసాగింది. అధికారంలో ఉంటే సుఖాలు అనుభవించవచ్చు. అప్పనంగా సంపాదించవచ్చు. అన్న ఏకైక లక్ష్యం కోసం రాజకీయ పార్టీలు ప్రజలను సమిధలుగా చేస్తున్న తీరు ప్రతి ఎన్నికల్లోనూ కనిపిస్తోంది. ప్రజలు మంచి అనుకున్న వారిని నమ్మి గద్దెనెక్కించినా వారు కూడా అలాగే తయారవుతున్నారు. తెలంగాణలో ఉద్యమం చేసిన పార్టీనే గద్దెనెక్కిస్తే ఎంతగా భ్రష్టపట్టించిందో చూశాం. ఏపీలో అయితే బటన్ నొక్కుడే అభివృద్ధి అని కొత్త తరహా రాజకీయం నెరిపారు. ఇలా ఎవరిని నమ్మాలి. కేంద్రంలో మోడీని నమ్మితే ఆదానీ, అంబానీలు రాజ్యమేలుతున్నారు. ప్రజల నడ్డి విరిచేలా పన్నులు వేస్తూ..బతకడం అన్నది భారం చేశారు. అంతకు ముందు పదేళ్ల కాంగ్రెస్ పాలనలో అవినీతి ఊడలు విశ్వవ్యాప్తం అయ్యాయి. అయినా ఇవే పార్టీలు మళ్లీ ప్రజల ముందుకు వస్తున్నాయి. దశాబ్దాలు గడిచిన తర్వాత కూడా నేటికీ ఇదే దుస్థితి కొనసాగుతోంది. అందరూ రాజకీయాధికార సాధన, ధన సంపాదనలే ఏకైక ధ్యేయంగా మార్చి, అబద్దాలు, ఆరోపణలు, దూషణలు చేసుకోవటం కారణంగానే భారత ప్రజాస్వామ్యంలో ప్రజలు ప్రతి ఎన్నికల్లో ఓడిపోతున్నారు. ఈ సువిశాల దేశంలోని అన్ని ప్రాంతాలను, అన్ని వర్గాల ప్రజలను రాజకీయ పార్టీలు బలిపశువులను చేస్తున్నాయి. ఎన్నికల ప్రచారాలు శృతిమించటం, గతంలో ఎన్నడూలేని స్థాయిలో ఆరోపణలు, దూషణలు, డబ్బులు వెదజల్లడం వంటి చర్యల కారణంగా ప్రజాస్వామ్య వ్యవస్థ దెబ్బతింటోంది.




# ఘనంగా ప్రపంచ యాంకలైజింగ్ స్పాండిలైటిస్ దినోత్సవం

**రోగులకు అవగాహన కల్పించిన డాక్టర్ నరేష్**

**వరంగల్ వాయిస్, మెడికల్ :** ప్రపంచ యాంకలైజింగ్ స్పాండిలైటిస్ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేష్ ఆర్థరైటిస్, రుమాటిజం సెంటర్ లో ప్రముఖ రుమటాలజిస్ట్ డాక్టర్ నరేష్ మాట్లాడుతూ యాంకలైజింగ్ స్పాండిలైటిస్ అనే జబ్బు ఎక్కువగా మధ్య వయసు వారిలో కనిపిస్తుందన్నారు. ఆడవారికంటే మగవారిలోనే ఈ జబ్బు ఎక్కువగా కనిపిస్తుందన్నారు. ఈ జబ్బుకు గురైన వారు ఎక్కువగా నడుము, మెడ నొప్పులతో బాధపడతారన్నారు. ఈ నొప్పులు ముఖ్యంగా ఉదయం సమయంలో ఎక్కువగా ఉంటుందన్నారు. వీటితోపాటు కీళ్లలో నొప్పితో కూడిన వాపులు, కీళ్లు బిగిసుకుపోవడం లాంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఇలాంటి లక్షణాలతో బాధపడేవాళ్లు వెంటనే కీళ్ల వైద్య నిపుణులను కలిసి తగిన పరీక్షలు చేయించుకొని చికిత్స తీసుకుంటే జబ్బు పూర్తిగా తగ్గుముఖం పడుతుందన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేష్ పేషంట్లతో మాట్లాడుతూ వివిధ అంశాలపై వారికి అవగాహన కల్పించారు.

# కూల్ కూల్

**అకాల వర్షంతో చల్లబడిన వాతావరణం**

**ఊపిరి పీల్చుకున్న జనం**

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** రాష్ట్రంలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. వేసవి తాపం నుంచి ఊరటనిస్తూ మంగళవారం మధ్యాహ్నం నుంచే వాతావరణం మారిపోయింది. తీవ్ర ఎండలు, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు అకాల వర్షం అనుకోని ఊరటనిచ్చింది. అయితే ఈ వర్షంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లనుంది. విదర్భ నుంచి తమిళనాడుకు విస్తరించి ఉన్న ద్రోణి ప్రభావంతో రానున్న మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. దీంతో తెలంగాణలోని 19 జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురస్తుందని వారు హెచ్చరించారు. గంటలకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. ఇప్పటికే ఆసిఫాబాద్, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్, హైదరాబాద్ జిల్లాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షమే కురిసింది. పలు జిల్లాల్లో రాళ్ల వాన పడింది. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఈదురు గాలులతో భారీ వర్షం కురుసింది. మరొకొన్ని చోట్ల తేలికపాటి జల్లులు కురుస్తున్నాయి. హైదరాబాద్ లోనూ ఒక మోస్తు వర్షం కురిసింది.

## నగరంలో భారీ నష్టం..

వరంగల్ నగరంలో గాలివానతో కురిసిన వర్షంతో అపార నష్టం వాటిల్లింది. వేగంగా వచ్చిన గాలలకు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఇండ్ల పై కప్పులు లేచి పోయాయి. చాలా ప్రాంతాల్లో విద్యుత్ కు తీవ్ర అంతరాయం కలిగింది. నగరంలోని 39వ డివిజన్ లక్ష్మీ నగర్ వీధిలో ఈదురు గాలకు కరెంటు స్తంభం విరిగిపడింది.



బట్టల బజార్ లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం ఎదురుగా ప్రధాన రహదారిపై మోకాళ్ల లోతు వర్షపు నీరు నిలువడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం మామునూర్, శంభునిపేట, ఖిల వరంగల్, శివనగర్, కాశిబుగ్గ పోచమ్మ మైదాన్, దేశాయిపేట, ఎంజీఎం సర్కిల్ లో భారీ వర్షం కురిసింది. సీఎం రేవంత్ రెడ్డి కార్నర్ మీటింగ్ కోసం ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీలు చిరిగి పోయాయి.

## శివనగర్‌లో కాంగ్రెస్ ప్రచారం



**వరంగల్ వాయిస్, శివనగర్ :** నగరంలోని 34వ డివిజన్ లో కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య గెలుపు కోరుతూ శామంతుల శ్రీనివాస్ ఇంటింటికి ప్రచారం నిర్వహిస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా శామంతుల శ్రీనివాస్ మాట్లాడుతూ కొండా దంపతుల ఆదేశాల మేరకు శివనగర్ లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్యకు అత్యధిక మెజారిటీ తేవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పగడాల సతీష్, కిరణ్, రాజు, సురేష్, సుధాకర్, వెంకన్న, మహిళా నాయకులు పాల్గొన్నారు.

## కళ్యాణోత్సవం పోస్టర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** భద్రకాళీ భద్రేశ్వరుల శ్రీ కళ్యాణ బ్రహ్మోత్సవాల సందర్భంగా వరంగల్ నాయీ బ్రాహ్మణ పొదుపు పరపతి పరస్పర సహకార సంఘం ఆధ్వర్యంలో 14న నిర్వహించే కళ్యాణోత్సవం పోస్టర్‌ను మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం కళ్యాణోత్సవానికి రావాల్సిందిగా నన్నపునేని నరేందర్‌ను ఆహ్వానించారు.

## బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం



**వరంగల్ వాయిస్, శంభునిపేట :** నగరంలోని 37వ డివిజన్ పరిధిలోని బెడ బుడిగ జంగాల కాలనీలో బీఆర్ఎస్ కార్యకర్తలు మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజాసమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ ను గెలిపించాలని స్థానిక కార్పొరేటర్ బోగి సువర్ణ సురేష్ కోరారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి కార్పొరేటర్ సువర్ణ సురేష్ మాట్లాడుతూ అమలుకానీ హామీలతో కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కిందని కానీ, రోజురోజుకు ప్రజలకు సమస్యలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు కరెంటు, నీటి సమస్యలు పెరిగిపోతున్నాయని, మరో వైపు నిత్యావసర ధరలు పెంచింది ఆ మతోన్మోద బీజేపీ పార్టీ అని దుయ్యబట్టారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలను ఓడించి బీఆర్ఎస్ పార్టీని గెలిపించుకుంటే ప్రజా సమస్యల పరష్కారం అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజారామ్, హరీష్, నగేష్, ఠాగూర్, శ్రీను, రాజు, కోమల తదితరులు పాల్గొన్నారు

## కారు గుర్తుకు ఓటేయాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ ఆదేశానుసారం 22వ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి మవురాపు గీత విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో వరంగల్ లోక్ సభ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మారేపల్లి సుధీర్ కుమార్ కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో 22వ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కంచర్ల శివ, ముఖ్య నాయకులు, బూత్ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీతోనే దేశాభివృద్ధి సాధ్యం

### డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ లోక్ సభ సమావేశంలో భాగంగా మంగళవారం జరిగిన పరకాల నియోజకవర్గం నడికూడ మండలంలో గల పలు గ్రామాలు చర్లపల్లి కేంద్రంగా చేసుకొని సమావేశమయ్యారు. ముఖ్య అతిథిగా పరకాల శాసనసభ్యుడు, వరంగల్ పార్లమెంట్ ఇంచార్జి రేవూరి ప్రకాశ్ రెడ్డి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకటరామిరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు దొమ్మడి సాంబయ్య, హనుమకొండ జిల్లా ఎస్సీ సెల్ డిపార్ట్మెంట్ చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ పాల్గొన్నారు. వరంగల్ వెస్ట్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి మీటింగ్ సందర్భంగా 53వ డివిజన్ ఇంచార్జి డాక్టర్ రామకృష్ణ డివిజన్ నాయకులతో జన సమీకరణ గురించి చర్చించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆధ్వర్యంలో పరకాల నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీతో కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్యను గెలిపించాలని, శాసనసభ ఎన్నికల్లో ప్రతి ఒక్క నాయకుడు కార్యకర్తలు ఎలాగైతే కష్టపడి పనిచేశారో అలాగే, లోక్ సభ ఎన్నికల్లో కూడా కష్టపడాలని కోరారు. మహిళా సోదరీమణులు గడపగడపకు బొట్టుపెడుతూ గత ప్రభుత్వం చేసిన అన్యాయాలు అక్రమాల గురించి తెలియజేస్తూ గడపగడప కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యకర్తలు ఇంకొంచెం ఉత్సాహంతో కార్యక్రమాలు ఊరు ఊరంతా నిర్వహించి బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు చేసిన అక్రమాల గురించి, చేసిన అన్యాయం, దోపిడిల గురించి తెలపాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల వారికి జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ, ప్రజలకు తెలియపరుస్తూ కాంగ్రెస్ పార్టీ అమలు చేసిన పథకాల గురించి వివరిస్తూ రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణలో దాదాపు 15 సీట్లు గెలిపించుకునేలా అందరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చరు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరేయాలని, రాహుల్ గాంధీని ప్రధాని చేసుకోవాలన్నారు. తెలంగాణ ఇచ్చిన తల్లి సోనియమ్మకు,రాహుల్ గాంధీ ప్రధానమంత్రి చేసి సోనియమ్మ తల్లి రుణం తీర్చు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ సెల్ కోఆర్డినేటర్ అరూరి సాంబయ్య, చర్లపల్లి గ్రామ సర్పంచ్ తిరుపతి రెడ్డి, పార్టీ ప్రెసిడెంట్ చల్లా రవీందర్ రెడ్డి, బ్లాక్ ప్రెసిడెంట్ చిన్ని, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ సాంబయ్య, మండల సమన్వయ కమిటీ రవీందర్ యాదవ్, అంజిరెడ్డి, రవీందర్ రెడ్డి, ప్రదీప్ రెడ్డి, నార్లపూర్ ప్రెసిడెంట్ ఓరుగంటి రాజు, వరికోల్ ప్రెసిడెంట్ రమేష్, వెంకటేశ్వర పల్లి ప్రెసిడెంట్ రఘు, నడికూడ మండల అధ్యక్షుడు దేవేందర్ గౌడ్, జిల్లా నాయకులు పొన్నం మహేష్ గౌడ్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు ప్రాధాన్యంపై అవగాహన




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మహాత్మా గాంధీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగ చైతన్యంపై హనుమకొండలో నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమంలో భాగంగా మంగళవారం సర్క్యూట్ హౌజ్ రోడ్డులోని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ వద్ద అవగాహన కార్యక్రమం నిర్వాహించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణగిరి వీరన్న మాట్లాడుతూ లోక్ సభ ఎన్నికలు 2024 పురస్కరించుకొని హనుమకొండ నగరంలో ఓటింగ్ శాతం పెంచడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. గ్రామాలలో 90 శాతం పైగా ఓటు వేస్తున్నారు. వరంగల్ హనుమకొండ నగరాలలో 60 శాతం లోపునే ఓటింగ్ శాతం నమోదు అవుతుందని, కాబట్టి, ఈ విషయాన్ని గమనించి ప్రతి ఒక్కరూ ఈనెల 13న జరిగే పోలింగ్ లో సామాజిక బాధ్యత వహించి మనకు ఎన్ని పనులు ఉన్నప్పటికీ అందరం ఓటు వేయాలని పిలుపునిచ్చారు. గాంధీ గుడి ట్రస్ట్ వరంగల్ కన్వీనర్ పరికిపండ్ల వేణు మాట్లాడుతూ నగరంలో ఓటింగ్ శాతాన్ని పెంచడానికి ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్య పరుస్తూ కరపత్రాలు పంపిణీ చేస్తూ ఓటింగ్ శాతం పెంపుదలకు గత వారం రోజులుగా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పెన్సనర్స్ యూనియన్ సభ్యులు ప్రభాకర్ రెడ్డి, మల్లేశం, కొంరయ్య, సాంబమూర్తి, శివ పాల్గొన్నారు.

## మోడీ జనసభను జయప్రదం చేయండి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ లోక్ సభ ఎలక్షన్స్ సందర్భంగా బీజేపీ వరంగల్ లోక్ సభ అభ్యర్థి ఆరూరి రమేష్ గెలుపు కోసం రేపు ప్రధాని మోడీ "ఓరుగల్లు జనసభ"ను విజయవంతం చేయాలని బీజేపీ కాంటెస్టేడ్ కార్పొరేటర్ ఆడేపు సృజన వెంకటేష్ పిలుపునిచ్చారు. 36వ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ గా పోటీ చేసిన ఆడేపు సృజన వెంకటేష్ అధ్వర్యంలో రేపు వరంగల్ మామునుర్ తిమ్మాపూర్ లో నిర్వహించే "ఓరుగల్లు జనసభ"కు విచ్చేస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ సభకు తరలిరావాలని 36వ డివిజన్ లోని ప్రజలకు డివిజన్ ఇంచార్జి కూచన క్రాంతి, డివిజన్ అధ్యక్షుడు పుప్పాల శ్రీనివాస్ ఆహ్వాన పత్రిక అందించడం జరిగింది. ఈ సందర్భంగా వేలాది మంది సభకు స్వచ్ఛంధంగా హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సీనియర్ నాయకులు కొప్పుల శ్రీనివాస్, బూత్ అధ్యక్షుడు గుగులోతు సురేష్, కొండ మహేశ్వర్, సృజన్, పెద్దిరాజు సంతోష్, సతీష్, గుండేటి రాజు, దుస్సా శ్రీధర్, బంకా రాజ్ కుమార్, సిద్ద రాజు, డివిజన్ ఐటీ, సోషల్ మీడియా కన్వీనర్ జోగు మధు కుమార్, బూత్ స్థాయి కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మొద్దు

### మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** కాంగ్రెస్ చేతిలో తెలంగాణ ఆగం కాకూడదంటే లోక్ సభ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేయాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మంగళవారం పరకాల పట్టణంలోని జూనియర్ కాలేజ్ గ్రౌండ్స్ లో వాకర్స్ ను, కూరగాయల మార్కెట్, లేబర్ అడ్డా, బస్టాండ్ కూడలి తదితర ప్రాంతాల్లో పర్యటించారు. లోక్ సభ ఎన్నికల్లో వరంగల్ బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ మారేపల్లి సుధీర్ కుమార్ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పరకాల పట్టణంలో కూరగాయల మార్కెట్ నిర్మిస్తే, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మార్కెట్ కు కరెంటు సప్లై ఇవ్వడం లేదన్నారు. కరెంటు సప్లై లేక ఫ్యాన్లు నడవక వ్యాపారస్తులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుకాణాలు కూడా తెరిచే పరిస్థితి లేదని అన్నారు .ఇప్పటికైనా కాంగ్రెస్ మోసాలను నమ్మొద్దని కోరారు. అలాగే లోక్ సభ ఎన్నికల్లో భాగంగా పరకాల మండలం లక్ష్మీపురం, వెల్లంపల్లి గ్రామాలలో ఉపాధి హామీ కూలీలను కలిసి కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థి డా.మారేపల్లి సుధీర్ కుమార్ ను గెలిపించాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** అయోధ్య పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఆశా డే కార్యక్రమానికి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.కళావతి భాయ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అయోధ్యపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని గర్భిణీ స్త్రీలను ప్రభుత్వ ఆసుపత్రి ప్రసవాలకు ప్రోత్సహించాలన్నారు. అదేవిధంగా నార్మల్ డెలివరీకి గర్భిణీ స్త్రీలను, వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో గత నెలలో జరిగిన అబార్షన్ల పై సమీక్షించి క్షేత్రస్థాయిలో ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు మొదటి కాన్పులో ఆడపిల్లలు ఉండి రెండోసారి గర్భం దాల్చిన వారిపై గట్టిగా నిఘా ఉంచాలని, సికిల్ సెల్ ఎనీమియా స్క్రీనింగ్ కేసులను 100 శాతం పూర్తి చేయాలని, వ్యాధి నిరోధక టీకాలను 100 శాతం చేయాలని, అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించి సూచనలు చేశారు. తదుపరి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ గూడూరు సందర్శించి నార్మల్ డెలివరీ ల ప్రాధాన్యత వివరించి కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో సాధారణ ప్రసవాలను జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని అక్కడ సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ బిందుశ్రీ, అయోధ్యపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారియమున, ఇంచార్జి డీపీహెచ్ఎన్ఓ మంగమ్మ, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

# జర్నలిస్టుకు బెదిరింపు

## అంతు చూస్తానని హెచ్చరిక

## మనం విలేకరిపై దౌర్జన్యం



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని దౌలత్ నగర్ గ్రామ పంచాయతీ పరిధిలో సోమవారం అర్ధరాత్రి స్థానిక పరమేశ్వర రైస్ మిల్లు యజమాని గడుదాసు చంద్రశేఖర్ అక్రమంగా, అనుమతి లేకుండా చెరువు మట్టిని తరలిస్తుండగా స్థానిక గిరిజనులు పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అనుమతి లేకుండా ఇష్టారాజ్యంగా రాత్రి వేళ చెరువు మట్టిని తరలిస్తున్న పొక్లెయినర్, లారీలు, ఇతర వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్ కు తరలించారు. అదే గ్రామానికి చెందిన మనం దినపత్రిక విలేకరి గడ్డం రాజశేఖర్ (కర్ణాకర్) విధి నిర్వహణలో భాగంగా ఘటనా స్థలానికి వెళ్లి వార్తా సేకరించే క్రమంలో ఫొటోలు తీశాడు. కాగా అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకోవడంతో కోపోద్రిక్తుడైన సదరు యజమాని, పరమేశ్వర రైస్ మిల్లు కార్మికులు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలతో కలిసి మంగళవారం ఉదయం మనం దినపత్రిక విలేకరి ఇంటిపై దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తూ, నోటికి వచ్చినట్లు దుర్భాషలాడుతూ అంతు చూస్తానని హెచ్చరించారు. విధి నిర్వహణలో ఉన్న విలేకరి ఇంటిపై దౌర్జన్యానికి పాల్పడడం సరికాదని స్థానికులు చెబుతున్నా వినకుండా, మీ కుటుంబ సభ్యుల అంతు చూస్తానని హెచ్చరించాడు. ఇదే విషయంపై మనం దినపత్రిక విలేకరి గడ్డం రాజశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టి తనకు, తన కుటుంబ సభ్యులకు పరమేశ్వర రైస్ మిల్లు యజమాని గడుదాసు చంద్రశేఖర్ వల్ల ప్రాణహాని ఉందని తెలియజేశారు. వెంటనే పోలీసులు స్పందించి అక్రమ దందాకు పాల్పడుతున్న చంద్రశేఖర్ పై కేసు నమోదు చేసి తమకు,తమ కుటుంబ సభ్యులకు ప్రాణ రక్షణ కల్పించాలని కోరారు. అయితే విధి నిర్వహణలో ఉన్న విలేకరి ఇంటిపై దౌర్జన్యాలకు పాల్పడం, చంపుతామని బెదిరింపులకు గురి చేయడం పత్రికా స్వేచ్ఛను హరించడమేనని మండల విలేకరులు పేర్కొన్నారు. పోలీసులు ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని బెదిరింపులకు పాల్పడుతున్న చంద్రశేఖర్ పై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని సదరు విలేకరులు కోరారు.

# ఏపీ ఎన్నికల ప్రచారంలో మనోడు



**వరంగల్ వాయిస్, మంగళగిరి :** ఆంధ్రప్రదేశ్ లో జరుగుతున్న శాసనసభ ఎన్నికల్లో భాగంగా గత పది రోజుల నుంచి మంగళగిరి నియోజకవర్గంలో నారా లోకేష్ బాబు గెలుపు కోసం మంగళగిరి నియోజకవర్గంలో వరంగల్ వెళ్లిన చిలువేరు రవీందర్ విస్తృతంగా ప్రచారం చేశారు. స్థానికంగా మంగళగిరి నియోజకవర్గంలో పద్మశాలీలు ఎక్కువగా ఉండటం వలన తను ఒక పద్మశాలి బిడ్డగా నియోజకవర్గంలోని పద్మశాలి సంఘాల పెద్దమనుషులతో మాట్లాడి లోకేష్ బాబును భారీ మెజార్టీతో గెలిపించాల్సిందిగా కోరినట్లు తెలిపారు. పద్మశాలి కుల బంధువులను నారా లోకేష్ బాబుకు ఓటు వేయాలనిగా అభ్యర్థించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్వీర్గీయ నందమూరి తారక రామారావు పెద్ద కుమార్తె లోకేశ్వరి, వారి అబ్బాయి శ్రీనివాసరావు, అదేవిధంగా తెలుగుదేశం పార్టీ అదిలాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు, అసిఫాబాద్ నియోజకవర్గ ఇంచార్జి పెరుగు ఆత్మరామ్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి చిలువేరు రవీందర్, స్థానికులు పాల్గొన్నారు.

# సొంత గూటికి చేరిన బదావత్ పెద్ద వీరు



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండలంలోని అక్కల్ చెడ గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు బదావత్ పెద్ద వీరుతో పాటు 6 కుటుంబాలు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు పులిశేరు రాజేందర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ లో చేరారు. వీరికి నర్సంపేట శాసన సభ్యుడు మాధవరెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి కాంగ్రెస్ లోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బదావత్ పెద్ద వీరు, మాజీ ఉప సర్పంచ్ బదావత్ రవితేజ, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు బదావత్ రవి, లావుడ్యా రాంసింగ్, ఇస్లావత్ రాంచంద్రు, ఒంటరి రాజు(సోనాట) ఉన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్, తాజా మాజీ సర్పంచ్ తూటి పావని రమేష్, మాజీ ఉప సర్పంచ్ బాణోత్ వీరన్న నాయక్, మండల ప్రధాన కార్యదర్శి బొంత సురేష్, బోనగిరి సారయ్య, బదావత్ వీరు, భూక్య సురేష్,పెద్దమ్మల రాజేందర్, మాలోత్ బీమా, వీరు ఇస్లావత్, ఆకుల అశోక్, ఫూల్ సింగ్, తేజావత్ శివ, రాజు, కయాజ్, సంతోష్, వెంకటేశ్, స్వామి, మాలోత్ రవి, బాణోత్ రవి, అశోక్, రాకేష్, నర్సింహ పాల్గొన్నారు.

# ఎలక్షన్ కోడ్ ఉల్లంఘించిన వారిపై కేసు నమోదు

**వరంగల్ వాయిస్, పరకాల :** లోక్ సభ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఎలక్షన్ కోడ్ అమల్లో ఉన్నందున ఎలక్షన్ కమిషన్ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై పరకాల సీఐ కేసు నమోదు చేశారు. బీఆర్ఎస్ పార్టీ ప్రస్తుత వైస్ చైర్మన్ విజయపాల్ రెడ్డి జన్మదిన వేడుకలను నిన్న సాయంత్రం పరకాల బస్టాండ్ సెంటర్ వద్ద రోడ్డుపై వాహనదారులకు రాకపోకలకు ఆటంకాలు కలిగిస్తూ పటాసులు పేలుస్తూ, కేకులు కట్ చేసిన రేవూరి జయపాల్ రెడ్డి, శనిగరం నవీన్, అడపా రాము, మడికొండ ప్రవీణ్, దుంపేటి నాగరాజు, మరికొందరి పైన ఎలక్షన్ కోడ్ ఉల్లంఘించినందుకు గాను కేసు నమోదు చేయడం జరిగిందని స్థానిక సీఐ రవిరాజు తెలిపారు.

# కడియం కావ్యకు మద్దతుగా బైక్ ర్యాలీ



**వరంగల్ వాయిస్, నడికూడ :** వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి కడియం కావ్యకు మద్దతుగా రాయపర్తి, నర్సక్కపల్లి, పులిగిల్ల గ్రామాల కాంగ్రెస్ నాయకులు మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. రాయపర్తి క్లస్టర్ గ్రామాల సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేస్తున్న పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ గ్రామ కమిటీల సమావేశానికి బయలుదేరారు. నర్సక్కపల్లి కాంగ్రెస్ గ్రామ కమిటీ ఈ సమావేశానికి నడికూడ మండలం కాంగ్రెస్ అధ్యక్షుడు బుర్ర దేవేందర్, నర్సక్కపల్లి ఎంపీటీసీ బుర్ర దీప, గ్రామ కమిటీ అధ్యక్షుడు జుంకాజువ్వ కుమారస్వామి,ప్రధానకార్యదర్శి తలగంప రాజు, సీనియర్ నాయకులు పాడి వివేక్ రెడ్డి, గుర్రాల సాంబరెడ్డి, ఆవుల సుమన్, నాగుర్ల శ్రీను, బుర్ర సురేందర్, తిప్పర్తి తిరుపతి రెడ్డి, ముంజ విజేందర్, కేశిరెడ్డి రమణారెడ్డి , పాడి సాంబరెడ్డి, బత్తిని రవి, బండి రవికుమార్, ఆవుల రవీందర్, తలగంప రవి, జుంకాజువ్వ పోషాలు, పులి సతీష్ మహిళా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాశిబుగ్గలో బీఆర్ఎస్ ప్రచారం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని 20వ డివిజన్‌లో మంగళవారం బీఆర్ఎస్ నాయకులు చిమ్మని శివ సంతోష్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిమ్మని సంతోష్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్ మహాశయులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో 20వ డివిజన్ అధ్యక్షుడు ఇక్బాల్, బీఆర్ఎస్ కార్యకర్తలు రూడం ప్రశాంత్, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వరంగల్ అభివృద్ధికి బీజేపీని గెలిపించాలి

## కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ నగర అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని బీజేపీ పార్టీని గెలిపించాలని 60వ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా వరంగల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ కు మద్దతుగా మంగళవారం 60వ డివిజన్ వడ్డేపల్లిలోని ముదిరాజ్ వాడలో స్థానిక కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్ ప్రచారంలో పాల్గొని నరేంద్రమోడీ అభివృధి కార్యక్రమాలు వివరిస్తూ కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీ తో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో 60వ డివిజన్ కోఆర్డినేటర్ వాసుదేవ రెడ్డి, 60వ డివిజన్ అధ్యక్షుడు సతీష్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, రామరాజు, యాదగిరి, ప్రవీణ్, సాగర్ గౌడ్, నరేష్, రమేష్, బాబీ, చందు, సంతోష్, కందికొండ రాజు, మట్టెపల్లి రాజు, మహిళ మోర్చా అధ్యక్షురాలు వనా దేవి, వనిత, మౌనిక బూత్ సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక క్వారీ వద్ద ఎన్నికల ప్రచారం



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, శ్రీను బాబు ఆదేశాల మేరకు మంగళవారం కాళేశ్వరం ఇసుక క్వారీ రోజు వారీ కూలీల దగ్గర కాంగెస్ పార్టీ నాయకులు చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రచారం చేసి అనంతారం, పుస్కు పల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. దుద్దిళ్ల శ్రీధర్ బాబు గెలిచి మూడు నాలుగు నెలలు కాకముందే కాళేశ్వరం గ్రామానికి యాభై లక్షల రూపాయలతో రోడ్లు వేయడం జరిగిందన్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేయడం జరుగుతుందని, అలాగే బీఆర్ఎస్ కు ఓటు వేసి మీ ఓటును వృథా చేయొద్దని హితవు పలికారు. మంచి చేసే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గడ్డం వంశీకృష్ణను గెలిపించి శ్రీధర్ బాబు నాయకత్వాన్ని బలంగా బలపర్చాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల, గ్రామానికి సంబంధించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మోడీ సభను విజయవంతం చేయాలి



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా 19వ డివిజన్ అధ్యక్షుడు మామిడాల సతీష్ అధ్యక్షతన మంగళవారం జరిగిన కాశిబుగ్గ బీజేపీ కార్యకర్తల సమావేశంలో రేపు ప్రధాని మోడీ సభను విజయవంతం చేయాలని, భారీగా కార్యకర్తలు తరలిరావాలని మామిడాల సతీష్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు అల్లి అజయ్ బాబు, గుర్రం సత్యనారాయణ, రాఘవాచారి, ముచ్చర్ల ప్రభాకర్, కోటి, గడ్డం భాస్కర్, బ్రహ్మచారి, అరవింద్, రవి రామ్ తేజ, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మట్టి దొంగల అరెస్ట్



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలోని దౌలత్ నగర్ చెరువు నుంచి మట్టిని ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్నారనే సమాచారంతో పర్వతగిరి ఎస్ఐ వెంకన్న సిబ్బందితో వెళ్లి ఒక హిటాచీ, ఒక టిప్పర్, మూడు ట్రాక్టర్లు పోలీస్ స్టేషన్ కు తరలించి మట్టిని తరలిస్తున్న 8మంది వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పోలింగ్ ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష



**వరంగల్ వాయిస్, పరకాల :** జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగ పద్మజ మండల పరిధిలో మాడల్ పోలింగ్ కేంద్రాల ఏర్పాటు గురించి చర్చించేందుకు గాను తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దార్ ఏవీ.భాస్కర్, ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు, మున్సిపల్ కమిషనర్ నరసింహులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పోలింగ్ స్టేషన్ 53 మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల వెలమవాడ , పోలింగ్ స్టేషన్ 49 ప్రభుత్వ జూనియర్ కళాశాల పరకాల, పోలింగ్ స్టేషన్ 76 మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల పోచారం లను మాడల్ పోలింగ్ కేంద్రాలుగా తీర్చి దిద్దవలసినదిగా సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## సుధీర్ కుమార్‌ను గెలిపించాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా 12వ డివిజన్ మార్కండేయ కాలనీలో బీఆర్ఎస్ పార్టీ 12 వ డివిజన్ ఇంచార్జ్ రాంకీ యాదవ్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఇంటింటికి కరపత్రాలు పంచుతూ బీఆర్ఎస్ అభ్యర్థి మారేపల్లి సుధీర్ కుమార్ ను అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బూర రమేష్, యూత్ నాయకులు ముంద్రాతి అనిల్, మైనారిటీ నాయకులు ఎస్ డీ కరీం, కొక్కుల శంకర్, చిలుక జగన్నాథం, కందకట్ల కృష్ణ పాల్గొన్నారు.

# మోడీ గెలిస్తే రిజర్వేషన్స్ మాయం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** దేశ భవిష్యత్తును నిర్ణయించే పార్లమెంట్ ఎన్నికలు ప్రజల ఆర్థిక సామాజిక సమస్యల పరిష్కారానికి, కార్పొరేట్ సంస్థల దోపిడి వ్యవస్థలకు మధ్యన జరుగుతున్న ఎన్నికలుగా భావించి తీర్పు ఇవ్వాలని ప్రజా సంఘాల జేఏసీ వైస్ చైర్మన్ డాక్టర్ సంగని మల్లేశ్వర్ అభిప్రాయపడ్డారు. ఖమ్మం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ మల్లేశ్వర్ ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం, సామాజిక న్యాయం సాధిద్దాం, కేంద్రంలో మార్పు కోసం ఓటేద్దాం అనే రెండు పేజీల కరపత్రం ఆవిష్కరించి మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా నరేంద్ర మోడీ పాలనలో ఎన్నడూ లేనంత స్థాయిలో నిరుద్యోగ సమస్య పెరిగిపోయిందని విద్యావంతులైన యువతీ, యువకులు ఉద్యోగాలు లభించక సాంఘిక భద్రత లేక ఆశాంతికి గురవుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. అంబేద్కర్ రాజ్యాంగంలో బడుగు బలహీన వర్గాలకు అందిస్తున్న రిజర్వేషన్లు కూడా తీసివేయడానికి కుట్ర జరుగుతుందని, భవిష్యత్తులో మోడీ గెలిస్తే రాజ్యాంగం తారుమారయ్యే అవకాశం ఉన్నదని, 80 కోట్ల పేద ప్రజలకు బ్రతకడం కత్తి మీద సాములా తయారవుతుందని ఆవేదన వెలుబుచ్చారు. అందుకోసం కాంగ్రెస్ ప్రకటించిన పంచ్ న్యాయ్, 25 అంశాల మేనిఫెస్టో బడుగుల జీవితాల్లో వెలుగు నింపుతుందని అందుకోసం రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరుస్తూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో, పూలే ఆశయ సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు, డాక్టర్ గట్టి ఎల్లయ్య, బీసీ సంఘం నాయకులు ఎర్రంశెట్టి ముత్తయ్య, పెరిక కుల సంఘం జిల్లా అధ్యక్షులు గజవెల్లి సత్యనారాయణ, బీసీ సంఘం నాయకులు బరుపటి ప్రసాద్, ముత్తినేని రత్నాకర్, బుడిమే విజయ్ కుమార్, సోమిశెట్టి రాధ శేఖర్,పాస్ నాయకులు అప్పని సతీష్ కుమార్, మేడిశెట్టి శ్రీనివాస్ రావు, కేయూ విద్యార్థి జేఏసీ నాయకులు డాక్టర్ వంగాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# మాయమాటలతో మళ్లీ మోసపోవద్దు

### బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపిద్దాం
### జడ్పీటీసీ శారదా రవీందర్



**వరంగల్ వాయిస్, మరిపెడ :** కాంగ్రెస్ పార్టీ మాయమాటలతో మళ్లీ మోసపోవద్దని మరిపెడ జడ్పీటీసీ తేజావత్ శారదా రవీందర్ నాయక్ అన్నారు. మహబూబాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి కవిత గెలుపునకు కాంక్షిస్తూ మంగళవారం మరిపెడ మండలంలోని వాల్య తండా, అజ్మీరా తండా, డీఎస్ఆర్ తండా గ్రామ పంచాయతీలో స్థానిక నాయకులతో కలిసి విస్తృత ప్రచారం చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాలోతు కవిత కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయని మోసపూరిత హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని పేరు ఉన్నారు. రైతులకు రైతుబంధు సహాయం కింద పొలాలు దున్నే టైంలో రైతుబంధు ఇవ్వాల్సింది పోయి, కోత సమయంలో రైతుబంధు ఇవ్వడం ఆశ్చర్యకరమన్నారు. గడిచిన పదేళ్లలో రైతాంగాన్ని కాపాడుకున్న ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. బీఆర్ఎస్ పాలనలో రైతులకు తాగు నీటికి ఇబ్బందులు లేవని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో పంట పొలాలకు నీరు అందక ఎండిపోయాయని వారు ఆరోపించారు సాధ్యం కానీ హామీలతో అధికారంలోకి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిందన్నారు. గ్రామాలలో తాగునీటి ఎద్దడి కనిపిస్తుందని, రుణమాఫీ కూడా చేయకుండా ఇప్పుడు ఎన్నికల సమయంలో పంద్రాగస్టున చేస్తామంటూ కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత మాటలు చెబుతుందని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజలు కేసీఆర్ కు అండగా నిలిచారని, కారు గుర్తుకు ఓటు వేసి పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కవితను అత్యధిక భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు.

## బీఆర్ఎస్‌కు పెరుగుతున్న ఆదరణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ లోక్ సభ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ మారెపల్లి సుధీర్ కుమార్ కు రోజు రోజుకు మద్దతు పార్లమెంట్ పెరుగుతోంది. నియోజకవర్గ పరిధిలోని పలు మండలాలు, గ్రామాల నుంచి తండోపతండాలుగా ప్రజలు తరలి వస్తున్నారు. నిత్యం హనుమకొండ జిల్లా పార్టీ కార్యాలయంలో అన్ని వర్గాల ప్రజలను కలుస్తూ వారి మద్దతు కూడా డాక్టర్ మారేపల్లి సుధీర్ కుమార్ తీసుకుంటున్నారు. స్వచ్ఛందంగా గ్రామాలలో ప్రచారం నిర్వహించి మీ గెలుపుకు కృషి చేస్తామని చెబుతున్నారు. కొన్ని వర్గాల వారు మద్దతు పత్రాలు అందచేస్తున్నారు. మరి కొందరు నేరుగా కలిసి పుష్ప గుచ్చాలు అందచేసి ముందస్తు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. తనదైన శైలిలో ప్రతి ఒక్కరికీ సమయం కేటాయిస్తూ గడిచిన పదేళ్లలో కేసీఆర్ చేసిన అభివృద్ధి,సంక్షేమ పథకాలను గుర్తు చేస్తూ తప్పకుండా మీ ఆశీర్వాదంతో నేను పార్లమెంట్ లో అడుగు పెడతాననే ధీమా వ్యక్తం చేస్తున్నారు.



## కార్పొరేటర్ మరుపల్ల రవి ప్రచారం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** బీఆర్ఎస్ పార్టీ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి మారేపల్లి సుధీర్ కుమార్ కారు గుర్తుకే అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని 40 వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పూజారి విజయ్ ఆధ్వర్యంలో మరుపల్ల రవి ఇంటింటికి తిరుగుతూ ప్రజలను కలుసుకొని గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. నేటి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని నిర్భయంగా కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో డివిజన్ అధ్యక్షుడు పూజారి విజయ్, కార్యదర్శి వనం కుమార్, కోరే కృష్ణ, అంకం దేవానంద్, పేర్న రవి, మరుపల్ల గౌతమ్, కొలుపుల చంద్రకళ, పోల్ పాక రాజన్ బాబు, గజ్జి సాంబయ్య, సాదుల రంజిత్, కళ్యాణ వెంకటేశ్వర్లు, మంద నవీన్, క్యాతం రాజేందర్, పోలేపాక మల్లేశం, చీర రమేశ్, చింతపట్ల ప్రశాంత్, నరేగే సదానందం, సామల కోటి, మాటేటి సారయ్య తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీని ఓడిస్తేనే దేశానికి రక్షణ

## సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాజ్యాంగం రక్షింపబడాలన్నా, ప్రజాస్వామ్యం పరిరక్షించాబడాలన్నా కేంద్రంలో బీజేపీని సాగనంపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో నవచేతన ప్రచురించిన 'మోడీ పాలనలో ప్రజాస్వామ్యం విధ్వంసం' అన్న పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒకే దేశం, ఒకే చట్టం అంటూ ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్ష తరహా పాలనకు ప్రయత్నిస్తున్నారని, దేశాన్ని హిందూ దేశంగా మార్చి మనువాద రాజ్యాంగాన్ని అమలు చేసేందుకు కుట్ర చేస్తున్నారని అన్నారు. నేడు దేశంలో అవినీతి పరులంతా బీజేపీలోనే ఉన్నారని, విపక్షాల నాయకులను ఈడీ, సీబీఐ, ఐటీలను ప్రయోగించి లొంగదీసుకుని బీజేపీలోకి చేర్చుకుని క్లీన్ చీట్ ఇస్తున్నారని అన్నారు. వీటి నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే రామాలయం, సీఏఏ, హిందూత్వం పేరుతో ప్రజలను మభ్యబెడుతున్నారని దుయ్యబట్టారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత దళితులు, మైనార్టీ వర్గాలపై దాడులు పెరిగాయని అన్నారు. బీజేపీ కేంద్రంలో తిరిగి అధికారంలోకి వస్తే ఉన్న రిజర్వేషన్ లను ఎత్తివేయడం ఖాయమని, అలాంటి పెత్తందారుల పార్టీకి దళిత, గిరిజన వర్గాలు,పేదలు గుణపాఠం చెప్పాలన్నారు. రైతులు, కార్మికులు, మహిళలు, నిరుద్యోగులు ఇలా అన్ని వర్గాల ప్రజలకు మోసం చేసిన బీజేపీని ఈ ఎన్నికలలో ఇంటికి సాగనంపాలని కోరారు. అలాగే ఏఐటీయూసీ జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయంలో పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, మాజీ జిల్లా కార్యదర్శి సిరబోయిన కర్ణాకర్, డీహెచ్ పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేల్పుల సారంగపాణి, జక్కు రాజు గౌడ్, నాయకులు కర్రె లక్ష్మణ్, మనిగాల భిక్షపతి, కొట్టపాక రవి, అంబి సాంబయ్య, బత్తిని సదానందం, గుంటి రాజేందర్, దామెర సుదర్శన్, శనిగరపు రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు



**వరంగల్ వాయిస్, కాటారం :** తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేపడుతున్న ప్రజాపయోగ పనులకు ఆకర్షితులై భారీగా బీఎస్పీ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు రాష్ట్ర ఐటీ పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఎస్పీ నాయకులు అట్టెం రమేష్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బీఎస్పీకి చెందిన నాయకులు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో శ్రీధర్ బాబు సమక్షంలో కాటారం ఎంపీపీ పంతకాని సమ్మయ్య నేతృత్వంలో చేరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి మంత్రి ఆహ్వానించారు. కరీంనగర్, పెద్దపెల్లి, కమాన్ పూర్, రామగిరి, రామగుండం, మంథని, తాడిచర్ల, కాటారం, మహాముత్తారం, మహాదేవపూర్ మండలాల నుంచి భారీ ఎత్తున సుమారు 500 మంది బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు.


## బీజేపీ ప్రచార రథంపై దాడి




**వరంగల్ వాయిస్, నడికూడ :** వరంగల్ లోక్ సభ ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్ది గ్రామాలలో ఎన్నికల వేడి వ్యంజుకుంటుంది. ప్రతిరోజు గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రచారాలు జోరందుకున్నాయి. గ్రామ గ్రామాన ప్రతిరోజు పార్టీల ప్రచార రాథలు తిరుగుతూ పాటలతో గ్రామాలలో తమ పార్టీ తరపున ప్రచారం చేస్తున్నాయి. ఇలాంటి ప్రచార రథాలు ప్రభుత్వ అనుమతితోనే తిరుగుతాయి. కానీ నడికూడ మండలంలో ప్రచార రథంపై దాడి పలువురుని విస్మయానికి గురిచేసింది. నడికూడ మండలం వరికోల్ గ్రామంలో బీజేపీ ప్రచార రథం తిరుగుతుండగా వరికోల్ కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు మధుకర్ అత్యుత్సాహంతో బీజేపీ ప్రచార రథం పై దాడి చేసి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఆరూరి రమేష్ ఫ్లెక్సీలను చింపివేయడంతో ఒక్కసారిగా గ్రామస్తులు విస్తూ పోయారు. వెంటనే కొంతమంది మధుకర్ ను వారించి అక్కడ నుంచి పంపించారు.

# విద్యార్థులు పట్టుదలతో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి

## ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**వరంగల్ వాయిస్, రేగొండ :** తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలను నెరవేర్చుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. మంగళవారం రేగొండ మండల కేంద్రంలోని ప్రైవేటు పాఠశాల పదో తరగతి మండల టాపర్ల సన్మాన కార్యక్రమం వాణి విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో జరగగా ఎమ్మెల్యే గండ్ర సత్తన్న ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పాఠశాల ఆవరణలో సేంద్రీయ వ్యవసాయ రైతు పరస్పర సహాయ సహకార సంఘం ఉపాధ్యక్షుడు గన్ రెడ్డి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర, పదవ తరగతిలో మండలంలో టాపర్ గా నిలిచిన పి శివ కార్తీక్ 10/10, పి.లక్ష్మీ ప్రియ జీపీఎస్ సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు నగదు అందజేసి శాలువాతో సన్మానించారు. 10 జీపీఏ సాధించిన విద్యార్థికి నగదు రూ.5000, రెండో స్థానంలో ఉన్న విద్యార్థికి రూ.3116 అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ గౌరవ అధ్యక్షుడు లక్ష్మీపతి, కమిటీ సభ్యులు శంకర్, రవీందర్ రెడ్డి , విజేందర్ రెడ్డి, ఆది రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఇప్పకాల నరసయ్య, మోడెం ఉమేష్ గౌడ్, మేకల భిక్షపతి, పీఏసీఎస్ చైర్మన్ నడిపెల్లి విజ్జన్ రావు, రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్ గౌడ్, ఎన్ఎస్ఆర్ సంస్థల చైర్మన్ నాగినేని సంపత్ రావు, ఆర్ఎన్ఆర్ ట్రస్ట్ చైర్మన్ కట్టంగూరి రామ్ నర్సింహారెడ్డి, స్థానిక ఎంపీటీసీ మైస సుమలత భిక్షపతి, జిల్లా ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడు ఎర్రబెల్లి రవీందర్రావు, పట్టేం శంకర్, అప్పం కిషన్, బీసీ మండల పార్టీ అధ్యక్షులు బొల్లపల్లి చంద్రమౌళి గౌడ్, మాజీ మండల పార్టీ అధ్యక్షులు కుందూరు రవీందర్ రెడ్డి, గండి తిరుపతి గౌడ్, యూత్ నాయకులు పున్నం ప్రవీణ్, ముదురుకోళ్ల తరుణ్, పలు గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ ఆదేశాల మేరకు 5వ డివిజన్ అధ్యక్షుడు పున్నం చందర్ ఆధ్వర్యంలో మంగళవారం బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి డా.మారేపల్లి సుధీర్ కుమార్ గెలుపే ధ్యేయంగా కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్తిస్తూ 5వ డివిజన్ లోని 4/2 బ్లాక్‌లో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పండగ సాగర్, విశాల్, సాయి, వినోద్, రవీందర్, మూల ప్రభాకర్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో తాడిశెట్టి క్రాంతి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరానికి చెందిన తాడిశెట్టి క్రాంతికుమార్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికకు నామినేషన్ వేశారు. వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికలలో భాగంగా ఆయన నల్గొండ కలెక్టరేట్‌లో నామినేషన్ పత్రాలను సమర్పించారు. పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటు తనకు వేసి ఎమ్మెల్సీగా గెలిపించాలని ఆయన కోరారు.

## ఆర్ కృష్ణయ్యను కలిసిన మేకల కేదార్ యాదవ్



**వరంగల్ వాయిస్, కాజీపేట :** రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్యను వరంగల్ బీసీ సంఘం నాయకులు బుట్టి శ్యామ్ యాదవ్, పాక శ్రీనివాస్ తో కలిసి వరంగల్, ఖమ్మం, నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ తరఫున పోటీ చేయడానికి మేకల కేదార్ యాదవ్ బీజేపీ తరఫున టికెట్ ఇప్పించాలని కోరారు. వెంటనే స్పందించి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తో ఫోన్ లో మాట్లాడటం జరిగిందన్నారు. దీనికి కిషన్ రెడ్డి సానుకూలంగా స్పందించడం జరిగిందనితెలిపారు. బీసీలకు తప్పకుండా అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారని మేకల కేదార్ యాదవ్ పేర్కొన్నారు.

## డంపింగ్ యార్డ్‌ను ఎత్తివేయాలి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని 40వ డివిజన్ లోని ఉర్సు గుట్ట వద్ద గల శానిటేషన్ డంపింగ్ యార్డ్ ను ఈ ప్రాంతం నుంచి ఎత్తివేయాలని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి మహానగర సీఎంహెచ్ఓ రాజేష్ కు వినతిపత్రం అందజేసి కోరారు. ఈ డంపింగ్ యార్డ్ లో పలుమార్లు అగ్ని ప్రమాదం ఏర్పడడం వలన చుట్టు ప్రక్కన గల ప్రాంత ప్రజలకు, వాకర్స్ కు ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. అలాగే పక్కన కోట్లాది రూపాయలు విలువ చేసే టయోటా షోరూం ఉన్నందున వెంటనే తరలించాలని కోరారు. వినతి పత్రంపై సీఎంహెచ్ఓ రాజేష్ స్పందిస్తూ 20 రోజుల లోపు చెత్తాచెదారాన్ని లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు.

# శరవేగంగా గేమ్ ఛేంజర్ షూటింగ్

## చిత్రంలో సన్నివేశం లీక్.. నెట్టింట హల్‌చల్

రామ్ చరణ్, కియారా అద్వానీ జంటగా 'గేమ్ చేంజర్' సినిమా చిత్రీకరణ జరుగుతున్నశరవేగంగా సాగుతోంది. శంకర్ ఈ సినిమాకి దర్శకుడు, దిల్ రాజు నిర్మాత. రామ్ చరణ్ ఈ సినిమాలో రెండు పాత్రల్లో కనపడనున్నారని తెలుస్తోంది. ఒక పాత్రకి కియారా అద్వానీ కథానాయిక కాగా, ఇంకో పాత్రకి అంజలి కథానాయిక. ఈ సినిమాలో ఇంకా చాలామంది నటీనటులు వున్నారు, అందులో శ్రీకాంత్, ఎస్.జె. సూర్య, సునీల్, సముద్రఖని, జయరాం లాంటి వారు నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమా మళ్ళీ వార్తల్లో వుంది. ఈసారి ఈ సినిమా చిత్రీకరణ జరుగుతుండగా ఈ సినిమా నుంచి లీకయిన సన్నివేశం ఒకటి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. అందులో పంచె కట్టులో వున్న రామ్ చరణ్, శ్రీకాంత్ ని హగ్ చేసుకుంటూ వున్న సన్నివేశం లీకయింది. మెగా అభిమానులు ఈ సన్నివేశం చూసి, ఇది థియేటర్ లో అయితే అదిరిపోతుంది అని సామాజిక మాధ్యమాల్లో ఈ సినిమా గురించి మాట్లాడుకుంటున్నారు.

మామూలుగా పెద్ద సినిమాలు చిత్రీకరణ జరుగుతున్నప్పుడు మొబైల్ ఫోన్స్ సెట్ పైకి తీసుకెళ్లనివ్వరు, కానీ మరి ఈ సన్నివేశం ఎలా లీకయిందో కూడా అర్థం కావటం లేదు అని చిత్ర యూనిట్ సభ్యులు అంటున్నారు. అయితే ఇదేమీ మొదటిసారి కాదని, ఇంతకు ముందు కూడా ఈ చిత్రం నుండి, అలాగే వేరే చిత్రాల నుండి కూడా ఇలా చిత్రీకరణ సమయంలో సన్నివేశాలు సామాజిక మాధ్యమాల్లో పెట్టారని అంటున్నారు. ఈ సినిమా చిత్రీకరణ ఎక్కువగా అవుట్ డోర్ లో చెయ్యడం వలన మొబైల్స్ పై కంట్రోల్ ఉండదని చెపుతున్నారు. ఏమైనా ఈ సినిమాపై అంచనాలు చాలా భారీగా వున్నాయి. రామ్ చరణ్ 'ఆర్ఆర్ఆర్' తరువాత చేస్తున్న సినిమా ఇదే కావటం, ఈ సినిమా అన్ని భాషల్లో విడుదల చేస్తూ ఉండటంతో ఈ సినిమాపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి.









# పది గంటల పాటు డంప్‌యార్డ్‌లో..

## కుబేర సినిమా కోసం ధనుష్ సాహసం

ధనుష్, నాగార్జున అక్కినేని ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కుతున్న చిత్రం 'కుబేర' శేఖర్ కమ్ముల దర్శకత్వంలో వస్తోంది. ప్రస్తుతం ముంబయిలో శరవేగంగా షూటింగ్ జరుగుతోన్న ఈ చిత్రానికి సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో తెగ షేర్ అవుతోంది. అది చూసిన నెటిజన్లు ధనుష్‌పై ప్రశంసలు కురిపిస్తున్నారు. ముంబయిలోని అత్యంత పెద్ద డంప్‌యార్డ్‌లో షూటింగ్ చేయాలని చిత్రబృందం నిర్ణయించిందట. ఇక ఆ సన్నివేశాలు సహజంగా రావడం కోసం ధనుష్ 10 గంటల సేపు మాస్క్ కూడా లేకుండా డంప్‌యార్డ్‌లో నటించారని సినీవర్గాలు పోస్టులు పెట్టాయి. దీంతో సినిమాలపై ఆయనకున్న నిబద్ధతను నెటిజన్లు కొనియాడుతున్నారు. ఇందులో ధనుష్ డీగ్లామరైజ్ పాత్రలో కనిపించనున్న విషయం తెలిసిందే. నాగార్జున ఫస్ట్‌లుక్ రిలీజ్‌చేయగా మంచి స్పందన వచ్చింది. సున్నితమైన అంశాలతో, మనసుల్ని హత్తుకునేలా కథలు చెప్పడం శేఖర్ కమ్ముల శైలి. 'కుబేర'తో తనదైన శైలిలో ఫిలాసఫీ చెప్పబోతున్నారు.. వాణిజ్య హంగుల్ని మేళవించి ఆయన తన మార్క్ కథ, కథనాల్ని తెరపై ఆవిష్కరించనున్నారు. దీంతో ఈ సినిమాలో ధనుష్, నాగార్జునల పాత్రలు ఎలా ఉండనున్నాయన్నది ఆసక్తికరంగా మారింది. కొత్త కాన్సెప్ట్‌తో రానున్న ఈ చిత్రంలో రష్మిక కథానాయిక. ఇటీవల ఈ చిత్రంపై ఆమె మాట్లాడుతూ.. 'ఇంత మంచి ప్రాజెక్ట్‌లో పనిచేయడం చాలా ఆనందంగా ఉంది. ఎన్నో కొత్త విషయాలు నేర్చుకున్నా. ప్రస్తుతం సుదీర్ఘమైన నెట్ షిఫ్ట్‌ల్లో షూటింగ్ జరుగుతుంది' అని చెప్పారు.




# దేవర ఎన్టీఆర్‌కు ప్రత్యేక మూవీ

## డైరెక్టర్ కొరటాల శివ కామెంట్స్

కొరటాల శివ దర్శకత్వంతో ఎన్టీఆర్ హీరోగా తెరకెక్కుతోన్న యాక్షన్ డ్రామా 'దేవర'పై ఎన్టీఆర్ అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల ఆయన దీని గురించి మాట్లాడుతూ.. అభిమానులంతా కాలర్ ఎగరేసుకునేలాంటి సినిమా అని చెప్పడంతో ఆ అంచనాలు రెట్టింపయ్యాయి. తాజాగా దర్శకుడు చేసిన కామెంట్స్ ఫ్యాన్స్‌లో జోష్ పెంచుతున్నాయి. ఓ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఇంటర్వ్యూలో పాల్గొన్న కొరటాల శివ 'దేవర' గురించి మాట్లాడుతూ.. 'ఇటీవల తారక్ కూడా దీని గురించి మాట్లాడాడు. ఎన్టీఆర్‌కు, ఆయన అభిమానులకు ఈ సినిమా కచ్చితంగా ప్రత్యేకంగా నిలుస్తుంది. ప్రస్తుతానికి ఇంతకు మించి చెప్పలేను. త్వరలోనే అప్‌డేట్స్ వస్తాయి' అన్నారు. దీంతో ఎన్టీఆర్ పుట్టినరోజు మే20 సందర్భంగా దీని నుంచి అప్‌డేట్ వచ్చే అవకాశముందని ఫ్యాన్స్ భావిస్తున్నారు. ఈ చిత్రంతో జాన్వీ తెలుగు తెరకు పరిచయమవుతుండగా, సైఫ్ అలీఖాన్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. కీలక పాత్రలో శ్రీకాంత్ కనిపించనున్నారు. తొలుత ఈ మూవీ మొదటి భాగాన్ని ఏప్రిల్ 5న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని భావించారు. అయితే కొన్ని కారణాల వల్ల దీని విడుదలను అక్టోబర్ 10కి వాయిదా వేశారు.

# అల్లు అర్జున్ తరహాలో ..



ఆ మధ్య అల్లు అర్జున్ విశాఖ వెళ్లినప్పుడు అభిమానులు విమానాశ్రయం నుంచి భారీ ర్యాలీ నిర్వహించి తమ అభిమానం చాటుకున్నారు. ఇప్పుడు విజయ్ దేవరకొండ కూడా అదే తరహాలో విశాఖపట్నం వెళ్లారు. దర్శకుడు గౌతమ్ తిన్ననూరితో చేయబోతే సినిమా కోసమని విశాఖపట్నం వచ్చిన విజయ్ దేవరకొండకి విమానాశ్రయంలో పెద్దపెట్టున అభిమానులు విచ్చేసారు. అక్కడ నుండి అభిమానులు విజయ్ వాహనం వెనకాలే మోటారు సైకిల్ ర్యాలీ లా వెళ్లారు. ఇక విజయ్ కూడా తన అభిమానులను పలకరించడానికి తన కారు టాప్ ఓపెన్ చేసి నిలుచొని అందరికీ అభివాదం చేసుకుంటూ తను బసచేయనున్న హోటల్ కి వెళ్లారు. ఇప్పుడు ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఇంతకు ముందు అల్లు అర్జున్ వచ్చినప్పుడు ఎలా మోటార్ బైక్ ర్యాలీ నిర్వహించారో, అదే తరహాలో ఇప్పుడు విజయ్ దేవరకొండ కి కూడా అభిమానులు ర్యాలీ నిర్వహించడం ఆసక్తికరం.

మంగళవారం 07, మే 2024
www.warangalvoice.net

# కేంద్రంలో గెలిచేది మోడీ.. ఇక్కడ గెలిచేది అరూరి

**కడియం శ్రీహరి ఒక మేక వన్నె పులి**

**ఆయన చరిత్ర అందరికీ తెలుసు**

**మీట్ ది ప్రెస్‌లో బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కేంద్రంలో గెలిచేది మోడీ..ఇక్కడ గెలిచేది అరూరి అని వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ జోస్యం చెప్పారు. యావత్ భారత దేశం మోడీయే మళ్ళీ ప్రధాని కావాలని కోరుకుంటున్నారన్నారు. 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కమలం పువ్వుకు ఓటు వేస్తామని ప్రజలు డిసైడ్ అయ్యారన్నారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు అధ్యక్షతన హనుమకొండలోని ప్రెస్ క్లబ్ లో మంగళవారం ఏర్పాటు చేసిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో అరూరి రమేష్ పాల్గొని ప్రసంగించారు. ప్రజలు ఆశీర్వదిస్తే మోడీ సహకారంతో వరంగల్ లోక్ సభ పరిధిలోని ప్రాంతాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కడియం శ్రీహరి చరిత్ర అందరికీ తెలుసని, ఆయన ఒక మేక వన్నె పులి అని సంబోధించారు. ఊసరవెల్లి కంటే తొందరగా రంగులు మార్చే వ్యక్తి కడియం అన్నారు. ఉపాధ్యాయుడిగా రాజీనామా చేసిన తర్వాత జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలయ్యారన్నారు. కడియం శ్రీహరికి గతంలోనే దళిత దొర అని ప్రజలు నామకరణం చేశారు. ఆయనకు నిజంగానే ఎలాంటి ఆస్తులు లేకుంటే ఇంద్రభవనం లాంటి ఇండ్లు ఎక్కడివని ప్రశ్నించారు. నేను పక్కా లోకల్ స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ బిడ్డనని చెప్పుకొనే కడియం కావ్య భర్త పేరు నజీరుద్దిన్...వాళ్ల స్వస్థలం గుంటూరు అని తెలిపారు. ఇక్కడ ఎంపి అభ్యర్థి కడియం శ్రీహరా.. అయినా కూతురు కావ్యనా అన్న అయోమయం నెలకొందన్నారు. కడియం శ్రీహరి 20 సంవత్సరాలు మంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా ఉండి వరంగల్ జిల్లా అభివృద్ధి చెందలేదు అని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మంత్రిగా ఉండి అభివృద్ధి చెయ్యలేనోడు ఇప్పుడు ఎలా చేస్తావో చెప్పాలన్నారు.

### దమ్ముంటే నిరూపించు..

కడియం శ్రీహరికి నిజంగా దమ్ము, ధైర్యం ఉంటే నేను ఎక్కడ భూములు కబ్జా చేశానో నిరూపించాలని అరూరి రమేష్ సవాల్ విసిరారు. బీఆర్ఎస్ పార్టీలో ఉన్నప్పుడు కొండా సురేఖకు టిక్కెట్ రాకుండా అడ్డుకున్నది నువ్వు కాదా అన్నారు. తాటికొండ రాజయ్యపై లేనిపోని ఆరోపణలు చేసి రాజకీయంగా బదనాం చేసింది నువ్వు కాదా అని నిలదీశారు. నేను మూడో సారి గెలిస్తే బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రిని అవుతానే కుట్రతో నన్ను ఓడించేందుకు కుట్రలు చేసింది నువ్వు కదా అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజకీయ లబ్ధి కోసం నన్ను బదనాం చేస్తున్నారన్నారు. ఓటమి భయంతోనే రేవంత్ రెడ్డి ఓరుగల్లులో మూడు సార్లు ప్రచారానికి వచ్చారన్నారు. రేవంత్ రెడ్డి ఇంకా ఎన్ని సార్లు వచ్చి ప్రచారం చేసిన నా గెలుపును ఆపలేరన్నారు.

### అభివృద్ధి మీ ముందు ఉంచుతా..

నన్ను గెలిపిస్తే వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి మీ ముందు ఉంచుతానన్నారు. మామునూరు ఎయిర్ పోర్ట్ పునరుద్ధరణ చేస్తానన్నారు. వరంగల్ ను ఐటీ హాబ్ గా మారుస్తానని, పాలకుర్తి నియోజకవర్గం కొడకండ్లలో మినీ టెక్స్ టైల్ పార్క్ పనులు పూర్తి చేయిస్తానన్నారు. కాజీపేట నుంచి భూపాలపల్లికి నూతన రైల్వే లైన్ తెస్తానన్నారు. మన పార్లమెంట్ లో వ్యవసాయ అనుసంధానంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు కృషి చేస్తానని, ఆసియా ఖండంలోనే రెండో అతి పెద్ద వ్యవసాయ మార్కెట్ ఎనుమాములను ఆధునీకరణ చేస్తానని, గతంలో ఎవరూ చేయని అభివృద్ధి నేను చూపిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కార్యదర్శి సదయ్య, కోశాధికారి అమర్, జర్నలిస్టు సంఘాల నేతలు మధు, బీఆర్ లెనిన్, దయాసాగర్, గడ్డం రాజిరెడ్డి, మెండు రవీందర్, వివిధ పత్రికలు, ఛానళ్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

### రేపు ప్రధాని సభ..

బుధవారం జరిగే ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ జన సభకు ప్రజలు, బీజేపీ కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని అరూరి రమేష్ కోరారు. ఉదయం 10 గంటలకు ప్రజలు, కార్యకర్తలు సభ ప్రాంగణానికి చేరుకోవాలన్నారు.



# ప్రసన్నాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

శ్రీ హనుమద్గిరి ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం ఉదయం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఐదు గంటలకు పంచామృత అభిషేకం, చందన సేవ, అర్చన నిర్వహించారు. అనంతరం మామిడికాయలు, నాగవెల్లి ధళాలతో స్వామి వారిని అందంగా అలంకరించారు. అనంతరం అర్చకులు ఆరుట్ల రామాచారి ఆధ్వర్యంలో గోత్రం నామార్చనను ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు భజన కార్యక్రమం నిర్వహించి తదుపరి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అన్నదాన కమిటీ అధ్యక్షులు గందె కృష్ణ, ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల రవికుమార్, కర్రు దశరథ్ కుమార్, మాదాసు మొగిలయ్య, గంద్రతి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

**- వరంగల్ వాయిస్, హనుమకొండ**

# అట్టహాసంగా రాకేష్ రెడ్డి నామినేషన్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** బీఆర్ ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఏనుగుల రాకేష్ రెడ్డి మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. అట్టహాసంగా సాగిన ఎమ్మెల్సీ నామినేషన్ ర్యాలీతో నల్గొండ పట్టణం గులాభిమయమైంది. నల్గొండలోని లక్ష్మీ గార్డెన్స్ నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించిన భారీ బైక్ ర్యాలిలో అభిమానులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వరంగల్-ఖమ్మం-నల్గొండ గ్రాడ్యుయేట్ బీఆర్ఏస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఏనుగుల రాకేష్ రెడ్డిని ఆ పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించడంతోపాటు బి ఫారం అందజేశారు. దీంతో ఉదయం హనుమకొండ నుంచి భారీ కాన్వాయ్ తో నల్గొండకు చేరుకున్న రాకేష్ రెడ్డి లక్ష్మి గార్డెన్ లో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. దీంతో గులాభి శ్రేణుల్లో నూతనోత్సాహం తొనిసలాడింది. సిట్టింగ్ సీటును నిలపెట్టుకుంటామంటూ మంత్రులు, ఎంఎల్ఏలు ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి, మాజీమంత్రి సత్యవతి రాథోడ్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఖమ్మం- వరంగల్-నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానం ఏర్పడిన నాటినుంచి ఒక్కో అభ్యర్థి రెండుసార్లు ఎమ్మెల్సీగా గెలిచారని ఈసారి ఉప ఎన్నికలో కూడా ఏనుగుల రాకేష్ రెడ్డి గెలవడం ఖాయమన్నారు. సాధారణ ఎన్నికల్లోనూ బీఆర్ ఎస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తాత మధుసూదన్, కంచర్ల భూపాల్ రెడ్డి, గ్యాదరి కిషోర్, మాజీ ఎంఎల్ఏలు, ఎంపీలు, జిల్లా అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



# రక్తంతో మోడీ చిత్రపటం

వరంగల్ నగరంలోని 42 వ డివిజన్ రంగసాయిపేట ప్రాంతానికి చెందిన ముత్తినేని విజయ చందర్ తన రక్తంతో మోడీ చిత్రపటాన్ని గీశారు. మోడీకి మీరాభిమాని అయిన విజయ చందర్ బీజేపీ క్రియాశీలక సభ్యులుగా కొనసాగుతన్నారు. మోడీ మీద అభిమానంతో రక్తంతో ఆయన చిత్ర పటాన్ని గీసినట్లు చెప్పుకొచ్చారు. ఈ చిత్రపటాన్ని బుధవారం వరంగల్ లో నిర్వహించనున్న జన సభ వేదికపై భారత ప్రధాని నరేంద్ర మోడీకి బహుకరణ చేయనున్నట్లు విజయ్ చందర్ తెలిపారు. **- వరంగల్ వాయిస్, వరంగల్**

# బలరాం నాయక్‌ని గెలిపించండి



**వరంగల్ వాయిస్, ములుగు :** మీరు ఆశీర్వదిస్తే మంత్రినయ్యా..ములుగు నియోజకవర్గం అభివృద్ధే నా లక్ష్యంగా పనిచేస్తున్నానని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి డాక్టర్ సీతక్క అన్నారు. ఎంపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ములుగు జిల్లా మంగపేట మండలం బ్రహ్మణ పల్లి చెక్ పోస్ట్ నుంచి ఏటూరునాగారం వరకు మంగళవారం మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ ని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు బైక్ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి బైక్ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం సీతక్క మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఉపాధి కూలీలకు ఏడాదికి 100 రోజులు పని కల్పించడంతో పాటు గతంలో మాదిరిగానే పని ముట్లు అందిస్తామని తెలిపారు. ఉపాధి హామీ కూలీలకు రోజుకు 400 రూపాయలు అందిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే పేదలకు భూములు ఇవ్వడంతోపాటు ఇందిరమ్మ ఇళ్లు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం జరిగిందన్నారు. పేదల పక్షాన నిలిచిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని పేర్కొన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ లు 10 యేండ్లు పాలించనప్పటికి ఏ ఒక్క పేదవాడికి న్యాయం చెయ్యలేదని ఆరోపించారు. కేసీఆర్ రూ.7 లక్షల కోట్లు అప్పు చేస్తే, నరేంద్ర మోడీ లక్షల కోట్లు అప్పు చేశాడని దుయ్యబట్టారు. ప్రభుత్వ రంగ సంస్థలను తన స్వలాభం కోసం ఆయన మిత్రులకు కట్టబెట్టి పేదల నడ్డి విరిచారని ఆరోపించారు. బలరాం నాయక్ కు అధిక మొత్తంలో ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ తో పాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, బ్లాక్ మండల గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com